క్లుప్తంగా

మద్ది ఆంజనేయస్వామికి ప్రత్యేక పూజలు



ప్రత్యేక పూజల అనంతరం ఉత్సవ మూర్తిని గర్భగుడిలోకి తీసుకెళుతున్న దృశ్యం

జంగారెడ్డిగూడెం రూరల్: గురవాయిగూడెం శ్రీమద్ది ఆంజనేయస్వామి వారిని మంగళవారం అధిక సంఖ్యలో భక్తులు దర్శించుకున్నారు. ఆలయ అర్చకులు స్వామి వారికి తమలపాకులతో ప్రత్యేక పూజలు నిర్వహించారు. 108 ప్రదక్షిణలు చేసి భక్తులు తమ మొక్కులు తీర్చుకున్నారు. ఆదాయం రూ:1,33,300 వచ్చినట్లు, 1500 మంది భక్తులు స్వామి వారి అన్నప్రసాదాన్ని స్వీకరించినట్లు ఆలయ ఈవో ఆకుల కొండలరావు తెలిపారు. ఆలయ పర్యవేక్షకులు జవ్వాది కృష్ణ, కురగంటి రంగారావు పాల్గొన్నారు.

బిషప్ జయరావును కలిసిన విజయరాజు



బిషప్ జయరావును కలిసిన విజయరాజు, వైఎస్సార్ సీపీ నేతలు

లింగపాలెం: వైఎస్సార్ సీపీ చింతలపూడి ఎమ్మెల్యే అభ్యర్థి కంభం విజయరాజు మంగళవారం పాశ్చానగరం చర్చిలో ఏలూరు బిషప్ పొలిమేర జయరావును కలిసి ఆశీస్సులు తీసుకున్నారు. అనంతరం ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. జయరావుకు పుష్పగుచ్ఛం అందజేసి సత్కరించారు. చింతలపూడి మాజీ ఏఎంసీ చైర్మన్ మందలపు సాయిబాబు, పార్టీ ముఖ్యనేత ముసునూరి వెంకటేశ్వరరావు, మండల అధ్యక్షుడు కొఠారి మోహన్, వైస్ ఎంపీపీ మట్టా సురేష్, నాయకులు మందలపు చిన్నచంటియ్య, కె రఘుబాబు, మందలపు పెద చంటియ్య తదితరులు ఉన్నారు.

వైఎస్సార్ సీపీతోనే అభివృద్ధి సాధ్యం



'మేము సిద్ధం.. మా ఊరు సిద్ధం' కార్యక్రమంలో పాల్గొన్న వైఎస్సార్ సీపీ శ్రేణులు

కామవరపుకోట: వైఎస్సార్ సీపీతోనే పేదల అభివృద్ధి సాధ్యమని, ఆ పార్టీ అభ్యర్థులను మళ్లీ గెలిపించుకోవాలని వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ మిడతా రమేష్‌బాబు అన్నారు. మంగళవారం కామవరపుకోట, కొత్తూరు గ్రామాల్లో మేము సిద్ధం.. మా ఊరు సిద్ధం కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా సర్పంచ్ కరిపోతు అనూష మాట్లాడుతూ కుల, మత, రాజకీయాలకు అతీతంగా అర్హులైన వారికి సంక్షేమ పథకాలు అందించి, పేదల అభివృద్ధికి తోడ్పాటు నిచ్చే ప్రభుత్వం వైఎస్సార్ సీపీ అని, ప్రజలు ఇంకా అభివృద్ధిని సాధించాలంటే సీఎం జగన్‌ను మళ్లీ అధికారంలోకి తీసుకొచ్చే విధంగా ప్రతి ఒక్కరూ కృషి చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ మేడూరు రంగబాబు, ఎంపీటీసీ బొల్లు వెంకట సత్యనారాయణ, మండల బూత్ కన్వీనర్ బోట్ల లక్ష్మణ్, నరసింహారావు, మారం కృష్ణమూర్తి, శ్రీనివాసు పాల్గొన్నారు.

1200 మందికి అన్నప్రసాద వితరణ

జంగారెడ్డిగూడెం: పట్టణంలోని సుందర బాల సుబ్రహ్మణ్యేశ్వర స్వామి ఆలయంలో మంగళవారం అన్నప్రసాద వితరణ చేశారు. సుమారు 1200 మంది అన్నప్రసాదాన్ని స్వీకరించినట్లు అన్నప్రసాద వితరణ కమిటీ అధ్యక్షుడు కానూరి గంగాధరరావు తెలిపారు. కాగా ఆలయ అభివృద్ధి కమిటీ చైర్మన్ కర్రి శ్రీరామ రెడ్డి, సుగుణ దంపతులు, అభివృద్ధి కమిటీ సభ్యులు జుజ్జూరి శ్రీనివాసరెడ్డి, సంయుక్తంగా రూ.2 లక్షలు విలువైన వెండి కంచము, గిన్నెలు స్వామివారి నైవేద్యానికి వినియోగించే నిమిత్తం బహూకరించారు.

డీఈవో తనిఖీ

జంగారెడ్డిగూడెం రూరల్: లక్కవరంలో పదో తరగతి పరీక్షా కేంద్రాన్ని మంగళవారం జిల్లా విద్యాశాఖాధికారి (డీఈవో) అబ్రహం తనిఖీ చేశారు. పరీక్షా కేంద్రం ఏర్పాట్లను ఆయన పరిశీలించారు. అనంతరం గ్రామంలోని ఎంపీపీ పాఠశాలను సందర్శించి విద్యార్థులతో మాట్లాడారు. పాఠ్యాంశాలలోని పలు అంశాలపై డీఈవో విద్యార్థులను ప్రశ్నలు అడిగారు. లక్ష్య సాధన దిశగా చదువుల్లో రాణించాలన్నారు.

ప్రశాంతంగా పది పరీక్షలు

ద్వారకాతిరుమల: పదో తరగతి పరీక్షలు మండలంలో ప్రశాంతంగా జరుగుతున్నాయి. స్థానిక శ్రీవారి దేవస్థానం హైస్కూల్, శ్రీనివాసా జూనియర్ కళాశాల, అలాగే ఎం.నాగులపల్లి పంచాయతీ పరిధిలోని డీపాల్ ఇంగ్లీష్ మీడియం స్కూల్‌లో ఈ పరీక్షలు జరుగుతున్నాయి. మంగళవారం జరిగిన హిందీ పరీక్షకు మొత్తం 356 మందికి గాను 304 మంది హాజరయ్యారు. పరీక్షా కేంద్రాలను ఎంఈవో-1 ఇ.శ్రీనివాసరావు, ఎంఈఓ-2 పరసా వెంకట్రావు పరిశీలించారు.

మల్టీపర్పస్ కేంద్రాలుగా.. సొసైటీలు

- పెట్రోల్ బంక్‌ల ఏర్పాటుతోపాటు గోడౌన్‌ల నిర్మాణం
- సొసైటీల బలోపేతానికి వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం తోడ్పాటు



కె.జగ్గవరం సహకార సంఘం పరిధిలో రాజుపోతేపల్లి అడ్డరోడ్డులో నిర్వహిస్తున్న పెట్రోల్ బంక్



మధ్యాహ్నపువారిగూడెం సహకార సంఘ పరిధిలో తిరుమలదేవిపేటలో నిర్మించిన మల్టీపర్పస్ గోడౌన్

టి.నరసాపురం: రైతులను అన్ని విధాలుగా ఆదుకోవడంతో పాటు రైతులకు నిత్యం తలలో నాలుకలా ఉంటూ అన్ని రకాల సేవలను అందిస్తున్న సహకార సంఘాలను సైతం వైఎస్సార్ సీపీ ప్రభుత్వం బలోపేతం చేసింది. ఫలితంగా సొసైటీలు మల్టీ పర్పస్‌గా రైతులకు ఉపయోగపడుతున్నాయి. సంఘాలు గతంలో రైతులకు పంట రుణాలు, భూముల అభివృద్ధికి దీర్ఘకాలిక రుణాలు మాత్రమే ఇచ్చేవి. అటువంటి సంఘాలు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వ ప్రోత్సాహంతో వాటి పరిధులను విస్తృత పరుచుకుని వాణిజ్య బ్యాంకులను మించి సేవలు అందిస్తున్నాయి. రైతుల అవసరాలను గుర్తించి వాటిని తీర్చిదిద్దే దిశగా పయనిస్తున్నాయి.

పెట్రోల్ బంకులు మంజూరు

రాష్ట్రంలో మల్టీపర్పస్ డెవలప్‌మెంట్‌లో భాగంగా ప్రభుత్వం సహకార సంఘాలకు మొదటి విడతగా 70 పెట్రోల్ బంక్‌లను మంజూరు చేయగా, వాటిలో రెండు పెట్రోల్ బంక్‌లు టి.నరసాపురం మండలానికి మంజూరయ్యాయి. కె.జగ్గవరం, మల్లుకుంట సహకార సంఘాలు పెట్రోల్ బంక్‌లను నిర్మించి పెట్రో ఉత్పత్తులను రైతులకు, వాహనదారులకు అందిస్తున్నాయి. వీటితో పాటు ఆయా సహకార సంఘాలు వాటి పరిధిలో రైతులు పండించిన పంటలను నిల్వ ఉంచుకోవడానికి, వాటిని ఆరబెట్టుకోవడానికి, రైతుల ఇతర అవసరాలు తీర్చడానికి లక్షలాది రూపాయల వ్యయంతో మల్టీ పర్పస్ గోడౌన్‌లను నిర్మించాయి. మల్లుకుంట సంఘ పరిధిలో బొర్రంపాలెంలో 1000 మెట్రిక్ టన్నుల సామర్థ్యం గల గోడౌన్‌ను నిర్మించగా, మక్కినవారిగూడెం సంఘం బండివారిగూడెంలోను, మధ్యాహ్నపువారిగూడెం సంఘం తిరుమలదేవిపేటలోను, కె.జగ్గవరం సంఘం బందంచర్ల, గుడ్లపల్లి గ్రామాల్లో 500 మెట్రిక్ టన్నుల సామర్థ్యం గల గోడౌన్‌లను నిర్మించి రైతులకు అందుబాటులోకి తెచ్చాయి. అలాగే కె.జగ్గవరం సహకార సంఘం, మల్లుకుంట సంఘం ఆయా సంఘాల పరిధిలో ఆర్‌వోఆర్ ప్లాంట్‌ను నిర్వహిస్తూ తక్కువ ధరకే మినరల్ వాటర్‌ను రైతులకు, స్థానికులకు అందిస్తున్నాయి. ఆయా సహకార సంఘాలు రైతులు పండించిన పంటలను విక్రయించుకోవడానికి అవసరమైన తూకాలు వేసుకోవడానికి వే-బ్రిడ్జిలను నిర్వహిస్తూ లాభాలు గడిస్తున్నారు.

అందుబాటులోకి లాకర్ సదుపాయం

కె.జగ్గవరం సంఘం బంగారు ఆభరణాలపై సైతం రుణాలు అందిస్తుంది. ఆయా సహకార సంఘాలు లాకర్ సౌకర్యాన్ని సైతం రైతులకు అందుబాటులోకి తెచ్చాయి. ఆయా సంఘాలు పంట రుణాలు, దీర్ఘకాలిక రుణాలతో పాటు రైతు నేస్తం రుణాలు, ఇతర అప్పులను అందిస్తున్నాయి. మండలంలోని ఐదు సహకార సంఘాలకు గాను నాలుగు సంఘాలు ఇప్పటికే పెట్రోల్ బంక్‌ల వ్యాపారం కలిగి ఉండగా, మధ్యాహ్నవారిగూడెం సంఘం కూడా దాని పరిధిలో బంక్‌ను ఏర్పాటుకు సన్నాహాలు చేస్తూ అవసరమైన స్థలాన్ని కొనుగోలు చేస్తోంది.

దాతలకు తగిన గుర్తింపు

సహకార సంఘాల అభివృద్ధికి కృషిచేసిన దాతలకు ఆయా సంఘాలు తగిన గుర్తింపును ఇస్తున్నాయి. అందులో భాగంగా కె.జగ్గవరంలో సహకార సంఘం ఏర్పాటుచేసి 40 ఏళ్లపాటు సొసైటీ అభివృద్ధికి కృషిచేసి దాదాపు 40 సెంట్ల స్థలాన్ని దానంగా ఇచ్చిన వెలిది కృష్ణమూర్తికి కాంస్య విగ్రహాన్ని ఆ సంఘ చైర్మన్ వాసిరెడ్డి మధు ఆధ్వర్యంలో సంఘ ఆవరణలో ఏర్పాటు చేసి ప్రారంభించారు. అదేవిధంగా ఆ సంఘ పరిధిలో రాజుపోతేపల్లి అడ్డరోడ్డులో పెట్రోల్ బంక్ నిర్మాణానికి అవసరమైన స్థలాన్ని దానంగా ఇచ్చిన రాజా రాఘవరాజు సూర్యనారాయణరాజు, గుడ్లపల్లిలో గోడౌన్ నిర్మాణానికి 20 సెంట్ల స్థలాన్ని దానంగా ఇచ్చిన రాఘవరాజు రంగరాజు కాంస్య విగ్రహాలను ఏర్పాటు చేసి ఇటీవల నాయకులతో ప్రారంభోత్సవాలు నిర్వహించారు. బందంచర్లలో గోడౌన్ నిర్మాణానికి 10 సెంట్ల స్థలాన్ని దానంగా ఇచ్చిన ఆచంట కుటుంబరావును సంఘం తరుపున సన్మానించారు.



గుడ్లపల్లిలో స్థలదాత రంగరాజు కాంస్య విగ్రహాన్ని ఆవిష్కరిస్తున్న ఎంపీ శ్రీధర్, ఎమ్మెల్యే బాలరాజు (ఫైల్)

వైఎస్సార్ సీపీ విజయానికి కృషి చేయాలి



దుద్దుకూరులో ఎమ్మెల్యే బాలరాజును కలిసి పుష్పగుచ్ఛం ఇస్తున్న దృశ్యం

బుట్టాయగూడెం: సార్వత్రిక ఎన్నికల్లో పోలవరం వైఎస్సార్ సీపీ అభ్యర్థి తెల్లం రాజ్యలక్ష్మి, ఏలూరు ఎంపీ అభ్యర్థి కారుమూరి సునీల్ గెలుపును ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి కానుకగా ఇద్దామని వైఎస్సార్ సీపీ యువజన విభాగం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కరాటం కృష్ణస్వరూప్ అన్నారు. మండలంలోని దుద్దుకూరు క్యాంప్ కార్యాలయంలో మంగళవారం కృష్ణస్వరూప్‌తోపాటు మరికొంతమంది నాయకులు, కార్యకర్తలు ఎమ్మెల్యే బాలరాజును మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా బాలరాజు మాట్లాడుతూ రాబోయే ఎన్నికల్లో వైఎస్సార్ సీపీ గెలుపు కోసం ప్రతి ఒక్కరూ కృషి చేయాలని కోరారు. కార్యక్రమంలో సర్పంచ్ మొడియం లక్ష్మి, నాయకులు తెల్లం దేవరాజు, ఈసు, కిరణ్, తటవర్తి రామకృష్ణ, ధర్మరాజు, నాగు, తదితరులు పాల్గొన్నారు.

పూర్వ విద్యార్థుల ఆర్థిక చేయూత

చింతలపూడి: చింతలపూడి ప్రభుత్వ ఉన్నత పాఠశాల 1984-85లో పదో తరగతి చదివిన పూర్వ విద్యార్థులు తమ తోటిమిత్రుడు జిల్లెళ్ళ తిలక్ బాబు కుమార్తె వివాహానికి రూ.50 వేలు ఆర్థిక సాయం అందించారు. ఈ కార్యక్రమంలో గరికిపాటి రవి, ఆకుల రమేష్ తదితరులు పాల్గొన్నారు.

జగనన్నను గెలిపించాల్సిన బాధ్యత ప్రజలదే



మఠంగూడెంలో నేతలతో చర్చిస్తున్న ఎమ్మెల్యే అభ్యర్థి విజయరాజు

లింగపాలెం: సార్వత్రిక ఎన్నికల్లో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీని గెలిపించేందుకు అందరూ కలసికట్టుగా పనిచేయాలని ఆ పార్టీ చింతలపూడి ఎమ్మెల్యే అభ్యర్థి కంభం విజయరాజు అన్నారు. మంగళవారం మఠంగూడెంలో పార్టీ నేత తాళ్ల సత్యన్నారాయణ ఇంటి వద్ద విజయరాజు పార్టీ నేతలతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రాష్ట్రంలో ప్రతి పేద కుటుంబానికీ సంక్షేమ పథకాలు అందించిన ఘనత సీఎం వైఎస్ జగన్‌కే దక్కుతుందన్నారు. అటువంటి నాయకున్ని మళ్లీ సీఎంగా గెలిపించుకోవాల్సిన బాధ్యత ప్రజలందరిపైనా ఉందన్నారు. కార్యక్రమంలో మాజీ ఏఎంసీ చైర్మన్ మందలపు సాయిబాబు, వైస్ ఎంపీపీ మట్టా సురేష్, పార్టీ ముఖ్యనేత ముసునూరి వెంకటేశ్వరరావు, పార్టీ మండల అధ్యక్షుడు కొఠారి మోహన్, మండల సచివాలయ కన్వీనర్ అన్నపనేని శాంతరావు, ధర్మాజీగూడెం సొసైటీ చైర్మన్ ఉప్పలపాటి వరప్రసాద్, నాయకులు పాల్గొన్నారు.

ఎన్నికల ఏర్పాట్లలో అధికారులు

ఐటీడీఏ పీఓ సూర్యతేజ



ఐటీడీఏ పీఓ సూర్యతేజ

బుట్టాయగూడెం: మే 13న జరగనున్న అసెంబ్లీ, పార్లమెంట్ ఎన్నికల నిర్వహణకు సిద్ధంగా ఉన్నామని ఐటీడీఏ పీఓ, పోలవరం నియోజకవర్గ రిటర్నింగ్ అధికారి ఎం.సూర్యతేజ తెలిపారు. మంగళవారం ఆయన 'సాక్షి'తో మాట్లాడుతూ భారత రాజ్యాంగం కల్పించిన ఓటు ఎంతో విలువైనదని అన్నారు. ఇది ప్రతి పౌరుని హక్కు అని చెప్పారు. ఓటు హక్కును వినియోగించుకోవాల్సిన బాధ్యతపై ఓటర్లపై ఉందని అన్నారు. అందుకు కావాల్సిన ఏర్పాట్లను పూర్తి చేశామని తెలిపారు. ప్రస్తుతం ఎన్నికల కోడ్ అమలులోకి వచ్చినందున ఎన్నికల నిర్వహణ యంత్రాంగాన్ని అప్రమత్తం చేశామని చెప్పారు. ఈవీఎంలను గోడౌన్‌లలో భద్రపరచడంతో పాటు వాటిని పోలింగ్ కేంద్రాలకు తరలించడం, అలాగే ఎన్నికలు అయ్యాక స్ట్రాంగ్ రూమ్‌లో భద్రపరిచే విధంగా చర్యలు తీసుకుంటున్నామని చెప్పారు. జాతీయ ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు పోలవరం నియోజకవర్గంలో ఎన్నికల నియమావళి కోడ్ పక్కాగా అమలు జరిగేలా చూస్తున్నామని అన్నారు. దీనిలో భాగంగా సుమారు 3,642 బ్యానర్‌లు, హోర్డింగ్స్, గోడ పెయింటింగ్స్‌ను తొలగించడంతోపాటు రాజకీయ నాయకుల విగ్రహాలకు ముసుగులు వేసినట్లు తెలిపారు. అలాగే నగదు, మద్యం అక్రమ రవాణాపై ప్రత్యేక నిఘా ఏర్పాటు చేశామన్నారు. నియోజకవర్గంలో ఎన్నికలకు సంబంధించి ఎటువంటి ఫిర్యాదు ఉన్నా వాటిని స్వీకరించడానికి కేఆర్‌పురం ఐటీడీఏ ఎన్నికల రిటర్నింగ్ అధికారి కార్యాలయం వద్ద కమాండ్ కంట్రోల్ సెంటర్‌ను ఏర్పాటు చేశామని అన్నారు. ఎవరైనా ఫిర్యాదు చేయాలనుకున్నవారు 08821-23221 నంబర్‌ను సంప్రదించాలని కోరారు. నియోజకవర్గంలో 7 మండలాల పరిధిలో సుమారు 284 పోలింగ్ కేంద్రాలు ఉన్నాయని అన్నారు. అన్ని కేంద్రాల్లో విద్యుత్ సదుపాయం, మంచినీరు, మెడికల్ క్యాంప్‌లు, తదితర సౌకర్యాలు ఉండే విధంగా ఏర్పాటు చేశామని చెప్పారు. అలాగే నియోజకవర్గ పరిధిలోని ఓటర్లు 2,52,592 మంది ఉన్నారని, వీరిలో పురుషులు 1,22,201, స్త్రీలు 1,30,350 మంది, ఇతరులు 11 మంది ఉన్నట్లు తెలిపారు. ప్రతి ఒక్కరూ ఓటు హక్కును వినియోగించుకునే విధంగా ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నామని చెప్పారు. అలాగే మారుమూల గిరిజన గ్రామాల్లో ఓటింగ్ శాతాన్ని పెంచే విధంగా గిరిజనులకు అవగాహన కలిగిస్తున్నామని అన్నారు.

విద్యార్థులు నాయకత్వ లక్షణాలు అలవర్చుకోవాలి



వ్యక్తిత్వ వికాసం, అభివృద్ధిపై అవగాహన సమావేశం నిర్వహిస్తున్న దృశ్యం

జంగారెడ్డిగూడెం: ప్రతి విద్యార్థి నాయకత్వ లక్షణాలు అలవర్చుకోవాలని అధ్యాపకులు పేర్కొన్నారు. స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో మంగళవారం వ్యక్తిత్వ వికాసం, అభివృద్ధిపై విద్యార్థులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఏలూరు జిల్లా యూత్ ఎఫైర్స్ డిపార్ట్‌మెంట్ పర్యవేక్షణలో ప్రిన్సిపాల్ ప్రసాద్‌బాబు అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో బంటుమల్లి ప్రభుత్వ కళాశాల అధ్యాపకులు ఎ.నాగేశ్వరరావు, పీవీఎస్ సత్యనారాయణ, కే జాన్ కెనడి, పట్టాభి తదితరులు పాల్గొని మాట్లాడారు. విద్యార్థులు వ్యక్తిత్వ వికాసాన్ని అభివృద్ధి చేసుకోవడం ద్వారా ఉన్నత విలువలు కలిగిన సమాజం ఏర్పడుతుందన్నారు. కళాశాల పొలిటికల్ సైన్స్ లెక్చరర్ ఎం.శ్రీనివాసరావు, సీనియర్ అధ్యాపకులు యు వెంకటాచార్యులు, బి.అశోక్, టీచింగ్ అండ్ నాన్ టీచింగ్ సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

ఓటు అడిగే హక్కు వైఎస్సార్ సీపీకే ఉంది



అంకన్నగూడెంలో నాయకులు, కార్యకర్తలతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే బాలరాజు, తెల్లం రాజ్యలక్ష్మి

బుట్టాయగూడెం(జీలుగుమిల్లి): సార్వత్రిక ఎన్నికల్లో వైఎస్సార్ సీపీ విజయం సాధించి మళ్లీ అధికారంలోకి వస్తుందని ఎమ్మెల్యే తెల్లం బాలరాజు ధీమా వ్యక్తం చేశారు. జీలుగుమిల్లి మండలం అంకన్నగూడెంలో పార్టీ నాయకులు, కార్యకర్తలతో మంగళవారం ఆయన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా బాలరాజు మాట్లాడుతూ రానున్న ఎన్నికల్లో వైఎస్సార్ సీపీ పోలవరం ఎమ్మెల్యే అభ్యర్థి తెల్లం రాజ్యలక్ష్మిని, ఏలూరు ఎంపీ అభ్యర్థి కారుమూరి సునీల్‌ను అత్యధిక మెజారిటీతో గెలిపించాలని కోరారు. సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి వివక్షతలేని పాలనతో ప్రతి ఇంటికీ సంక్షేమ పథకాలు అందాయని, అందుకే ప్రతి ఇంటికీ తిరిగి ఓటు అడిగే హక్కు ఒక్క వైఎస్సార్ సీపీకే ఉందన్నారు. గత ప్రభుత్వ నాయకులు జన్మభూమి కమిటీల పేరుతో దోచుకున్నారని, వారికి ఓటు అడిగే హక్కు లేదన్నారు. రాబోయే ఎన్నికల్లో ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి చెప్పినట్లు 175 స్థానాలను గెలుచుకోవడం ఖాయమని, ఆ దిశగా ప్రతి కార్యకర్త పనిచేయాల్సిన బాధ్యత ఉందని అన్నారు. వైఎస్సార్ సీపీ పోలవరం ఎమ్మెల్యే తెల్లం రాజ్యలక్ష్మి మాట్లాడుతూ తనపై ఎంతో నమ్మకంతో సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పోలవరం అభ్యర్థిగా అవకాశం ఇచ్చారని అన్నారు. నిరంతరం ప్రజాసేవకు అంకితమై జగనన్న నమ్మకాన్ని నిలబెట్టుకుంటానని చెప్పారు. తాను ఉపాధ్యాయురాలిగా ఎంతో మంది విద్యార్థులను ఉత్తమ పౌరులుగా తీర్చిదిద్దేందుకు కృషి చేశామని, అదేవిధంగా నియోజకవర్గంలోని సమస్యల పరిష్కారానికి కూడా చిత్తశుద్ధితో పనిచేస్తానని తెలిపారు. ఈ కార్యక్రమంలో పార్టీ మండల కన్వీనర్ చందా ప్రసాద్, జెడ్పీటీసీ మల్లం వసంతరావు, స్థానిక నాయకులు, కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు.

సమాజాభివృద్ధికి యువత చొరవ చూపాలి



పాశ్చానగరం చర్చిలో ప్రసంగిస్తున్న ఏలూరు బిషప్ పొలిమేర జయరావు

లింగపాలెం: సమాజంలోని రుగ్మతలను రూపుమాపడానికి ఆధ్యాత్మిక కేంద్రాలైన దేవాలయాలు దోహదపడుతాయని ఏలూరు బిషప్ పొలిమేర జయరావు అన్నారు. మంగళవారం లింగపాలెం మండలం పాశ్చానగరం విచారణలో పునీత జోజప్ప మహోత్సవాల ముగింపు కార్యక్రమంలో బిషప్ జయరావు పాల్గొని దివ్యబలిపూజ సమర్పించి ప్రత్యేక పూజ కార్యక్రమాన్ని నిర్వహించారు. అనంతరం బిషప్ జయరావు మాట్లాడుతూ క్రీస్తు చూపించిన ప్రేమను ఇతరులకు పంచి సోదర భావంతో కలసిమెలసి జీవించాలన్నారు. తోటివారి పట్ల దయ, క్షమాగుణం కలిగి ఉండాలన్నారు. సమాజాభివృద్ధికి అంకితభావంతో పనిచేసేందుకు యువత చొరవ చూపాలన్నారు. పాపరక్షకుడు క్రీస్తు మార్గంలో ప్రతి ఒక్కరూ పయనించాలన్నారు. ఈమేరకు సంఘస్తులు, ఫాదర్లు, పాస్టర్లు బిషప్ జయరావును ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో స్థానిక విచారణ ఫాదర్ హెచ్ ఏసురత్నం, సహాయక గురువులు, సిష్టర్లు, పలు విచారణలకు చెందిన ఫాదర్లు, సంఘ పెద్దలు, విశ్వాసులు పాల్గొన్నారు. అనంతరం భారీ అన్నసమారాధన నిర్వహించారు.

వాహన తనిఖీలు

జంగారెడ్డిగూడెం: స్టాటస్టిక్ సర్వైవల్ టీమ్ మంగళవారం జంగారెడ్డిగూడెంలో తనిఖీలు నిర్వహించారు. పట్టణంలోని ఎస్సార్ పెట్రోల్ బంక్ వద్ద టీమ్ సభ్యులు పి.బ్యూల, సీహెచ్ రమణ, చిట్టిబాబు వాహన తనిఖీచేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఎన్నికల కోడ్‌లో భాగంగా జంగారెడ్డిగూడెం పట్టణ పరిధిలో నియోజకవర్గ రిటర్నింగ్ అఫీసర్, ఆర్డీవో కె.అద్దయ్య ఆదేశాల మేరకు ఈ తనిఖీలు నిర్వహించినట్లు చెప్పారు. వాహనాలలో ఎన్నికల ప్రక్రియకు విఘాతం కలిగించే ఎటువంటి అనుమానిత వస్తువులు గాని, నగదు, మద్యం తదితర వాటిని తరలించకుండా ముందస్తు చర్యల్లో భాగంగా తనిఖీ చేసినట్లు వివరించారు.

గంగపుత్రుల సంక్షేమమే లక్ష్యం



ఎర్రకాలువలో చేపల వేట సాగిస్తున్న మత్స్యకారులు



సబ్సిడీపై వాహనాన్ని పొందిన బెజవాడ నాగరాజు

- ఎర్రకాలువ జలాశయంపై 2 వేల మంది మత్స్యకారుల జీవనోపాధి
- మత్స్యకారుల అభివృద్ధికి జగనన్న ప్రభుత్వం కృషి

జంగారెడ్డిగూడెం రూరల్: వేకువజామునే నిద్ర లేచి గంగమ్మను నమ్ముకుని చేపల వేట సాగించే గంగ పుత్రుల సంక్షేమమే లక్ష్యంగా వైఎస్సార్ సీపీ ప్రభుత్వం పరిపాలన చేస్తోంది. జిల్లాలో మధ్య తరహా ప్రాజెక్టు అయిన జంగారెడ్డిగూడెం మండలం కొంగువారిగూడెం శ్రీకరాటం కృష్ణమూర్తి ఎర్రకాలువ జలాశయంపై ఆధారపడి జీవిస్తున్న మత్స్యకార కుటుంబాల్లో చేదోడుగా నిలిచే అనేక పథకాల ద్వారా లబ్ధి పొందారు. ఈ జలాశయంలో 6 మత్స్యకార సంఘాల ద్వారా చక్రదేవరపల్లి, దేవులపల్లి, వేగవరం, జంగారెడ్డిగూడెం, తాడువాయి, ఎ.పోలవరం, బొర్రంపాలెం, సింగరాయపాలెం గ్రామాలకు చెందిన 2 వేలకు మందికి పైగా మత్స్యకార కుటుంబాలు ఆధారపడి జీవనాధారం సాగిస్తున్నారు. తమ ఇష్టదైవం ముత్యాలమ్మను ప్రార్థించి చేపల వేటకు పయనమవుతారు. కృష్ణా జిల్లాలోని అనేక ప్రాంతాల నుంచి ఎర్రకాలువ ప్రాంతానికి తరలివచ్చి మత్స్యకారులు స్థిరపడ్డారు.

మత్స్యకారుల సంక్షేమానికి ప్రభుత్వం కృషి

ఆంధ్రప్రదేశ్ మత్స్యశాఖ ద్వారా పీఎంఎంఎస్‌వైలో అనేక పథకాలు మత్స్యకారులకు చేరవయ్యాయి. ఎర్రకాలువ జలాశయంలో చేపల వేట ద్వారా మత్స్యకారులు జీవనోపాధి పొందేందుకు 1.20 లక్షల చేప పిల్లలను జలాశయంలో విడిచిపెట్టారు. జలాశయంలో వేటద్వారా సేకరించిన చేపలను మార్కెట్ చేసుకునేందుకు సబ్సిడీలపై వాహనాలను అందించడం జరిగింది. ఈ ప్రభుత్వంలో ఎ.పోలవరం గ్రామానికి చెందిన బెజవాడ నాగరాజు రూ.13 లక్షల 60 వేల విలువైన ఐషర్ వ్యాన్ 40 శాతం సబ్సిడీపై పొందారు. అలాగే దేవులపల్లికి చెందిన చాబత్తుల ఆనంద్‌కు రూ.3 లక్షల విలువైన ఆటోను 60 శాతం సబ్సిడీపై అందజేశారు. మత్స్యకార సొసైటీల పరిధిలో ఉన్న 50 సంవత్సరాలు పైబడిన 36 మందికి నెలకు రూ. 3 వేలు పింఛన్‌ను రాష్ట్ర ప్రభుత్వం అందిస్తుంది. వేటకు వెళ్లి ప్రమాదవశాత్తు మృతి చెందిన మత్స్యకారులకు రూ.10 లక్షలు ఎక్స్‌గ్రేషియా ఇలా అనేక పథకాలను అమలు చేస్తున్నారు.

మత్స్యకారులకు అండగా జగనన్న



మత్స్యకారుల సంక్షేమమే లక్ష్యంగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి కృషి చేస్తున్నారు. 40 శాతం సబ్సిడీపై చేపలు మార్కెట్ చేసుకునేందుకు వ్యాన్‌ను పొందాను. ఎర్రకాలువ, చెరువులను నమ్ముకునే మత్స్యకారుల జీవనోపాధి కోసం చేప పిల్లలను విడిచి పెట్టడంతో పాటు, అర్హులైన మత్స్యకారులకు ప్రభుత్వం పథకాలను అందిస్తూ ఆదుకుంటుంది.

– బెజవాడ నాగరాజు, ఎ.పోలవరం